## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

**ప్రజాశక్తి - తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. బుధవారం స్వామివారి దర్శనం కోసం భక్తులు 20 కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం స్వామివారిని 75,875 మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.07 కోట్లు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. స్వామివారికి 35,439 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శన టికెట్లను టిటిడి బుధవారం విడుదల చేసింది. జులై, ఆగస్టు నెల 300రూ.దర్శనం టికెట్లు ఉదయం 10 గంటలకు విడుదల చేయడంతో అప్పటికే వేచియున్న భక్తులు రెండునెలల టికెట్లను ముడుగంటల్లో కొనుగోలు చేశారు.

### ఉపాధి చట్టానికి తూట్లు..

# కూలీలకు తప్పని పాట్లు

**ప్రజాశక్తి-వి.కోట:** వ్యవసాయ కూలీలకు పనుల కల్పన, వలసల నివారణ, దేశ ప్రజలందరికీ ఉపాధి కల్పించడమే లక్ష్యంతో గత పాలకులు తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి నేటి పాలకులు పలుగు, పార, నీరు, నీడ లేని కరువు పనులుగా మార్చి కూలీల హక్కులను కాలరాస్తోంది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకానికి నిధుల కోత పెట్టి పథకాన్ని నీరుగారుస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పేదల కడుపు నింపుతున్న ఉపాధి హామీ**

తినడానికి తిండి, చేసేందుకు పనులు లేక బతుకు బరువైన సమయంలో అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్న లక్ష్యంతో గత పాలకులు ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో వి.కోట మండలంలోని 18 గ్రామపంచాయతీలలో కరువు పనులను సద్వినియోగం చేసుకుని చెరువుల్లో, కాలువలలో పూడికతీత, చెరువుల చుట్టూ సరిహద్దు కందకాలు తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించుకొని, రైతులు తమ పొలాల్లో సరిహద్దు కందకాలు తవ్వడం వంటి పనులతో ఉపాధి పొందుతున్నారు. వీటితోపాటు రైతులు తమ పొలాల్లో పండ్లు, పూల తోటల పెంపకంతో బీడు భూముల్లో కూడా లక్షలు సంపాదిస్తున్నారు.

**ఉపాధి అనుసంధానంతో మెరుగైన అభివృద్ధి**

ఉపాధి హామీని ఇతర రంగాలకు అనుసంధానం చేయడంతో మౌలిక వసతులు, స్థిరాస్తులు మెరుగు పడటంతో పాటు తమకు పని దినాలు కలిసి వస్తున్నాయని కూలీలు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, ఆర్‌బికె భవనాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌ల నిర్మాణంతో ప్రభుత్వ ఆస్తులు పెరిగాయి. ప్రభుత్వం పక్కా గృహాల నిర్మాణానికి, పచ్చదనం పెంపొందించేందుకు ఈ పథకాన్ని అనుసంధానం చేయడంతో వ్యక్తిగతంగా, సామూహికంగా ఎంతో ఉపయోగపడుతోందని ఉపాధి కూలీలు తెలియజేస్తున్నారు.

**కరువును జయించారు**

గతంలో వరుస కరువు మండలంగా ఉన్న వి.కోటలో ఉపాధి హామీని సద్వినియోగం చేసుకొని ప్రజలు కరువును జయించారు. ప్రస్తుత పాలకులు సాంకేతిక కారణాలు చూపి వేసవిలో కూలీలకు అందాల్సిన కనీస హక్కులైన పని ప్రదేశాల్లో తాగు నీరు, నీడకు సరఫరా చేస్తున్న టార్పాళ్ళు, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను నిలిపివేశారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు పనులకు అవసరమైన పలుగు, పార, తట్టలు, మెడిసిన్ కిట్లు ప్రస్తుతం ఎందుకు నిలిపివేశారని కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఎండలు మండిపోతున్న తరుణంలో గతానికి భిన్నంగా పని ప్రదేశాల్లో ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఫోటోలు తీయాలన్న నిబంధన దారుణమన్నారు.

**కూలీల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం**

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు సాంకేతిక కారణాలు చూపుతూ కూలీల హక్కులను కాలరాస్తోంది. చేసిన పనులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కచ్చితంగా పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించి యధావిధిగా పాత నిబంధనలు అమలు చేసి సకాలంలో వేతనాలు అందించాలి.

**- వెంకట్రామప్ప, ఉపాధి హామీ మేట్, బోడిగుట్లపల్లి పంచాయతీ.**

**వలసలు నివారించడమే ఉపాధి హామీ లక్ష్యం**

అందరికీ పనులు కల్పించి వలసలు నివారించడమే ఉపాధి హామీ లక్ష్యమని, మండలంలో మొత్తం 12,294 జాబ్ కార్డులు మంజూరు చేయగా 22,577 మంది రిజిస్టర్ కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 15,786 మంది వేతన దారులు వివిధ పనుల్లో ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు, వాటికి అనుగుణంగా మండలంలో అందరికీ పనులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం

**- అశోక్ రెడ్డి, ఏపీవో, వి.కోట మండలం.**

## చంద్రబాబుకు డిపాజిట్లు దక్కవు: మంత్రి

కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**ప్రజాశక్తి-రొంపిచెర్ల:** జిల్లాలో చంద్రబాబుకు డిపాజిట్లు దక్కవని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో చంద్రబాబునాయుడు కక్షపూరిత ధోరణితో అడ్డుకుంటున్నారన్నారు. జిల్లా ప్రజలకు మేలు చేస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని అన్నారు. కక్షపూరితంగానే చంద్రబాబు నాయుడు సుప్రీం కోర్టుకు వెళ్లి ప్రాజెక్టు నిర్మాణాలపై స్టే తీసుకొని వచ్చారన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుకి జిల్లాలో డిపాజిట్లు కూడా దక్కవని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో జిల్లాలో మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తే జిల్లా ప్రజల అభివద్ధి గిట్టని చంద్రబాబు వాటిని ఆపించారని అన్నారు. పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లి, పీలేరు నియోజకవర్గాల్లో తాగు, సాగు నీటిని అందించాలని మూడు రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభివద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి ముందుకు సాగుతున్నారని అన్నారు. అలాగే వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇస్తే, దానిని ఒకటిన్నర సంవత్సరం పాటు కోర్టులో అడ్డుకున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అన్నారు. ప్రజలకు మేలు జరగకూడదని చంద్రబాబు చేస్తున్న కక్ష పూరిత పనులన్నిటిని రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఓటుతో బుద్ధి చెప్తారని తెలిపారు. ప్రజలందరూ మరింత గొప్ప విజయాన్ని సీఎం వైఎస్ జగన్ కు అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రేణుక,జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ శేఖర్, మండల కన్వీనర్ చెంచు రెడ్డి, డీసీసీబీ హరినాథరెడ్డి, సర్పంచ్ ఇబ్రహీం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనాలు పంపిణీ

వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

**ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:** చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు సచివాలయంలో చిత్తూరు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు బుధవారం సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రైతుల సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ఎరువులు, పురుగు మందులు, వేరు శనగ విత్తనాలు సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## దుకాణం ఖాళీ చేయాలని దౌర్జన్యం

**ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:** చెప్పుల దుకాణాన్ని ఖాళీ చేయాలని దౌర్జన్యంగా తమపై దాడులకు పాల్పడుతున్న వారి నుంచి రక్షణ కల్పించాలని ఐరాల మండలం పాటూరు సంత గేటుకు చెందిన పాపులర్ షూ కంపెనీ నిర్వాహకులు అమరేష్, మల్లీశ్వరి దంపతులు బుధవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో మీడియాను ఆశ్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పూతలపట్టు మండలం ఆకానం బట్టు గ్రామానికి చెందిన వారమని, బతుకు తెరువు కోసం 2018 సంవత్సరంలో చెప్పుల దుకాణం నడిపేందుకు ఐరాల మండలం పాటూరు సంత గేటు దగ్గరున్న పాటూరుకు చెందిన రామ్మూర్తి నాయుడు అనసూయమ్మల సొంత భవనాన్ని 10 సంవత్సరాలకు అగ్రిమెంట్ చేయించుకోవడం జరిగిందని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా తాము చెప్పుల దుకాణం నడుపుకుంటూ వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. చెప్పుల దుకాణాన్నే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నామని అయితే ఉన్న ఫలంగా షాపులు కాళీ చేయాలని రామ్మూర్తి నాయుడు అనసూయమ్మలు తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. ఆయన బంధువైన తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు గిరినాయుడు అండదండలతో రౌడీలతో వచ్చి చెప్పుల దుకాణంపై అలాగే తమపై కూడా దాడికి పాల్పడుతూ దుకాణాన్ని ధ్వంసం చేశారన్నారు. అంతేకాకుండా షాపులోని రూ.10 లక్షల డబ్బును దోచుకుని వెళ్లిపోయారని అలాగే రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిలిందన్నారు. వారి నుంచి మాకు న్యాయం చేయాలని వారు పేర్కొన్నారు.

## పకడ్బందీగా వ్యర్థాల నిర్వహణ: కమిషనర్

వ్యర్థాల ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న నగర కమిషనర్

**ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:** నగరపాలక డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాల నిర్వహణ మరింత పకడ్బందీగా చేపట్టాలని నగర కమిషనర్ జె అరుణ నగరపాలక, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కమిషనర్ నగరపాలక డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా డంపింగ్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన బాలింగ్ మిషన్, కొకొనట్ షడ్డర్, పల్వరైజర్ యంత్రాలను, వాటి పని తీరును పరిశీలించారు. ఈ యంత్రాల ద్వారా ప్లాస్టిక్, ఇతర పొడి వస్తువులను కంప్రెస్ చేయడం, కొబ్బరి వ్యర్థాలను చిన్న చిన్న ముక్కలుగా చేయడం, తడి వ్యర్థాలను త్వరగా ఆరబెట్టడం వంటి పనులను పరిశీలించారు. యంత్రాల వినియోగంపై రోజువారి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. బయో మైనింగ్‌కు ఏర్పాటుచేసిన యంత్రాలను పరిశీలించి బయోమైనింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. డంపింగ్ యార్డులో వర్మీ కంపోస్ట్, విండ్రో కంపోస్ట్, సేంద్రియ వ్యవసాయాన్ని మెరుగ్గా చేపట్టాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం కమిషనర్ గాంధీ కూడలి వద్ద జరుగుతున్న డివైడర్‌కు రంగులు వేయడం, ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల ఏర్పాటు, సుందరీకరణ పనులను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డా.లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, ఏఈ శ్రీలత, రవీంద్ర పాల్గొన్నారు.

## ఫీజులు చెల్లించే బాధ్యత విద్యార్థులదే: కలెక్టర్

**ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:** కళాశాలకు ఫీజు చెల్లించే బాధ్యత, తల్లుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ చేయించే బాధ్యత విద్యార్థులదేనని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో జగనన్న విద్యా దీవెన రెండవ త్రైమాసికం జనవరి 2023 నుంచి మార్చి 2023 వరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. స్థానిక జిల్లా సచివాలయం నుంచి రాష్ట్ర విదేశీ విద్య వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కర్నూల్ రీజియన్ ఆర్గనైజర్ శైలజా రెడ్డి, పలమనేరు-కుప్పం-మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, నగర పాలక సంస్థ మేయర్ ఆముద, జడ్పి వైస్ ఛైర్మన్ రమ్య, తవణంపల్లి జడ్పిటిసి, స్త్రీ శిశుసంక్షేమ స్థాయి సంఘ ఛైర్మన్ భారతిలతో కలిసి జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులందరూ మంచిగా చదువుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు డబ్బులు జమచేస్తుందని విద్యార్థులకు సూచించారు. జగనన్న విద్యా దీవెన ద్వారా మీ తల్లుల బ్యాంక్ ఖాతాలకు జమ అయిన డబ్బును మీ తల్లిదండ్రులతో మాట్లాడి మీరు చదువుతున్న కళాశాలకు ఫీజ్ చెల్లించే బాధ్యత మీపై ఉందన్నారు. మీరు సకాలంలో కళాశాలలకు ఫీజ్ చెల్లిస్తే ప్రశాంతంగా చదువుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా మీ తల్లుల బ్యాంక్ ఖాతాలకు ఆధార్ లింక్ చేయించాల్సిన బాధ్యత మీదేనన్నారు. విదేశీ విద్య వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు యం.జ్ఞానేంద్ర రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి దేశ చరిత్రలోనే మొదటిసారిగా పేద విద్యార్థులు చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆర్థిక పరిస్థితులు ఎన్ని వున్నా విద్యార్థులు చదువుకు ఆటంకం కలగకుండా ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడం జరుగుతుందని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 27,774 మంది విద్యార్థులు, 25,033 మంది తల్లుల బ్యాంక్ ఖాతాలకు 21,21,44,514 రూపాయల చెక్కును అందజేశారు. స్త్రీ శిశుసంక్షేమ శాఖ కర్నూల్ రీజియన్ ఆర్గనైజర్ శైలజా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల బంగారు భవిష్యత్తు బాటలు వేస్తున్నారని తెలిపారు. పురుషులకు దీటుగా మహిళలకు అన్ని విభాగాలలో అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలను విద్యార్థులను తమ బిడ్డలకు భావించి వారి చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఫీజు రీయింబర్స్మెంట్ అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు- కుప్పం- మదనపల్లె అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, నగర పాలక సంస్థ మేయర్ ఆముద, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ రమ్య, తవణంపల్లి జడ్పిటిసి, స్త్రీ శిశు సంక్షేమ స్థాయి సంఘ ఛైర్మన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

**జులై 31 లోపు వైఎస్సార్ కంటి వెలుగు పూర్తి చేయాలి**

వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా అవ్వ, తాతలకు నిర్వహించే పరీక్షలు జులై 31 లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి సన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రకాశంతో కలిసి ఫ్యామిలీ డాక్టర్స్ ప్రోగ్రాం, అనామిక కేసులు ఫాలోఅప్, పీడబ్ల్యు-హెచ్‌బి టెస్టింగ్, ఎస్‌డిజి, ఎఎన్ఎం ఫీడ్ బ్యాక్, ఎన్‌సిడిసిడి సర్వే, వైఎస్సార్ కంటి వెలుగు, బర్త్ ప్లానింగ్, పోస్టునటల్ అనామిక టెస్టింగ్‌పై జిల్లాలోని అన్ని మండలాల్లోని సిహెచ్‌సి, పిహెచ్‌సిల డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,14,901 మందికి గాను, ఇప్పటి వరకు 97,167 మందికి వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారని, మిగిలినవి కూడా పూర్తి చేయాలని మెడికల్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిసిహెచ్ఎస్ డాక్టర్ నాయక్, డిపిఎమ్ఒ డా.శ్రీనివాసరావు, డిసిఆర్‌బిఎస్ డాక్టరు సుదర్శన్, ఎస్ఓ రమేష్ రెడ్డి, ప్రోగ్రాం, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

**జులై లోపు ఇండ్ల నిర్మాణాలు పూర్తి కావాలి**

గృహ నిర్మాణ సంస్థ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి జులై లోపు ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు,గృహ నిర్మాణ సంస్థ పిడి పద్మనాభం తో కలిసి నవరత్నాలు పేదలందరికీ ఇండ్లు, ఇండ్లు నిర్మాణాలకు సంబంధించి గృహ నిర్మాణ సంస్థ ఈఈ లు,డీఎలు,ఏ ఈలు,మున్సిపల్ కమిషనర్లు, యం పి డి ఓ లతో గృహ నిర్మాణాల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి జులై నాటికల్లా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి జులైలో గృహ ప్రవేశాలు నిర్వహించాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఈఈలు, డీఈలు, ఏఈలు,యం పిడివోలు,మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## అడిషనల్ ఎస్‌పిగా ఎల్.సుధాకర్

**ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:** జిల్లా 26వ అడిషనల్ ఎస్.పి అడ్మినిస్ట్రేషన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎల్ సుధాకర్ తరువాత జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డిని ఎస్.పి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతపురం జిల్లా బుక్కపట్టణం గ్రామానికి చెందిన ఎల్.సుధాకర్ 1995 బ్యాచ్‌లో ఎస్సైగా పోలీసుశాఖలో చేరారు. మొదటి పోస్టింగ్లో కడప జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ గా పలుచోట్ల పని చేసిన అనంతరం సిఐ గా పదోన్నతి పొంది అనంతపురం, కర్నూలు, కడప లో విధులు నిర్వహించి డిఎస్పీగా రాయలసీమ జిల్లాల్లోని కడప ఎస్సీ/ఎస్టీ సెల్ కు, ప్రొద్దుటూరు, ఏసీబీ డిఎస్పీ తిరుపతి, తిరుమల క్రైం డిఎస్పీగా పనిచేసి ఇప్పుడు ప్రమోషన్ మీద చిత్తూరు జిల్లా 26వ అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పోలీస్ అధికారులు, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్ అధికారులు, ఏ.ఆర్. అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది మర్యాదపూర్వకంగా అడిషనల్ ఎస్.పి ని కలిసారు.

## మట్టిలో మాణిక్యాలను గుర్తించడమే లక్ష్యం: మంత్రి రోజా

**ప్రజాశక్తి-నగరి:** గ్రామీణ స్థాయిలో మట్టిలో మాణిక్యాలను గుర్తించి వారిని సానబెట్టి అంతర్జాతీయ స్థాయిలో ఆడేలా చేయడమే ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక వేసవి క్రీడా శిక్షణా శిబిరాల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖా మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం స్థానిక కేవీకే క్రీడాప్రాంగణంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణా శిబిరాలను, ఇండోర్ స్టేడియంను జిల్లా ఎస్పీ వై.రిషాంత్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. మంత్రి, ఎస్పీ కలిసి క్రికెట్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ ఆటలను ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహపరచడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించి ఒక ప్రణాళిక ప్రకారం క్రీడారంగంలో వారిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. క్రీడలతో గెలుపోటములను తట్టుకునే మానసికస్థితి వచ్చి దఢంగా తయారౌతారన్నారు. క్రీడలు ఆరోగ్యాన్ని ఇవ్వడంతోపాటు ఇందులో సాధించే మెడల్స్‌తో ఉద్యోగాలు వస్తాయన్నారు. సచివాలయ వ్యవస్థలో స్పోర్ట్స్ కోటాలో 2500 మందికి పైగా ఉద్యోగాలు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి క్రీడల పట్ల ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు.

ఎప్పుడూ క్రీడాకారులను ప్రోత్సహించడంలో ముందుంటానన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికేట్లు అందిస్తామన్నారు.

**క్రీడలు మానసికంగా బలపరుస్తాయి: రిషాంత్ రెడ్డి**

క్రీడలు విద్యార్థిని మానసికంగా బలపరుస్తుందని, సెలవులు ఎలా సరదాగా గడపాలి అన్న ఆలోచన ఉన్నవారికి వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఆహ్లాదంతో పాటు వారిని మానసింగా బలపరచడానికి ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి అన్నారు.

**విద్యతోనే రాష్ట్రాభివృద్ధికి పునాది**

విద్యతోనే రాష్ట్రాభివృద్ధికి పునాది అని మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన 84 మందిని, ఇంటర్‌మీడియట్ లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన 25 మందిని ఆమె శాలువాలతో సన్మానించి షీల్డులు, బహుమతులు అందజేశారు. ఇంటర్ విద్యార్థులకు స్మార్ట్ ఫోన్‌లు అందించారు. విద్యార్థుల ప్రోత్సాహానికి ఇప్పటి వరకు నగరి చరిత్రలో లేని కొత్త అధ్యాయానికి ఆమె నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యే రాష్ట్రాభివద్ధి పునాది అని జగనన్న నమ్మారు కనుకే నేడు ఏ రాష్ట్రంలో లేని విధంగా, మునుపెన్నడూ జరగని విధంగా విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్య పేదలకు అందించిన ఘనత జగనన్నదే అన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి మేనమామ జగన్‌మోహన్ రెడ్డికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారన్నారు. అందుకే వారందరినీ ట్రస్టు ద్వారా అభినందిస్తున్నానన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఫలితాల్లో నెంబర్‌వన్‌గా ఉండాలన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు రాని వారు దిగులుపడాల్సిన అవసరం లేదని లక్ష్యాలు పెట్టుకొని ముందుకు వెళ్లాలన్నారు. తాను కూడా సినిమా, రాజకీయ రంగంలో తొలుత అపజయాలు చవిచూశానని అంతమాత్రాన వెనకడుగు వేయలేదని ఆ రెండు రంగాల్లో విజయం సాధించగలిగానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కతిక కార్యక్రమాలు, నత్యాలు పలువురిని అలరించాయి. ఆర్డీవో సుజన, చిత్తూరు, తిరుపతి డీఈవోలు విజయేంద్రరావ్, శేఖర్ రెడ్డి, మంత్రి సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మునిసిపల్ ఛైర్మన్‌లు నీలమేఘం, హరి, నగరి, పుత్తూరు ఎంపీపీలు భార్గవి, మునివేలు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనాల పంపిణీ

**ప్రజాశక్తి-పలమనేరు:** మండల రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 'వేరుశనగ విత్తనాల పంపిణీ' కార్యక్రమానికి అతిథిగా ఎమ్మెల్యే వెంకటే గౌడ హాజరై అర్హులైన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేలురకమైన వేరుశనగ విత్తనాల పంపిణీని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలమనేరు మండలానికి సంబంధించి 1056 క్వింటాళ్ల విత్తనాన్ని 12 రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు, ఈనెల 26, 27, 29, 30 తేదీల్లో రైతులందరికీ వారి సచివాల పరిధిలో పంపిణీ చేయబడునని తెలిపారు. 30 కేజీల బస్తా రూ.1674 ఉందని ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, పాస్ పుస్తకం, మొబైల్ నెంబరు తీసుకొని సచివాలయ పరిధిలో తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, రూరల్ కన్వీనర్ బాలాజీ నాయుడు, జడ్పిటిసి రంగనాథం, సింగిల్ విండో ప్రెసిడెంట్ రాజారెడ్డి, ఏరియా ఆసుపత్రి ఛైర్మన్ జంగారెడ్డి, వైస్ ఎంపీపీ గజేంద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీడీవోలు, ఎమ్మార్వో, అగ్రికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కిల్ హబ్‌తో ఉపాధి అవకాశాలు

**ప్రజాశక్తి-కార్వేటినగరం:** స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటుందని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ అతి తక్కువ కాలం (3నెలలు) స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారు వివిధ రంగాల్లో రాణిస్తూ ఉపాధి అందిపుచ్చుకోవచ్చని అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ స్కిల్‌హబ్ ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని త్వరగా ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. అదే విధంగా గతంలో స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారికి ప్రిన్సిపల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. అదనపు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఏకాంబరం, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ అబ్దుల్, డిప్యూటీ ట్రైనింగ్ అధికారి విక్రమ్, అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**ప్రజాశక్తి-కార్వేటినగరం:** రాష్ట్రీయసేవా సమితి, శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో బుధవారం కార్వేటినగరం వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించిందని కోఆర్డినేటర్ వెంకటమని అన్నారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ రాస్ సంస్థ సహకారం, శంకర్ నేత్రాలయ వారి సౌజన్యంతో అందిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వడమాలపేట, కార్వేటినగరం, పుత్తూరు, నారాయణవనం ప్రాంతాలలో ప్రతి నెలా ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్‌తో పాటు, కంటి అద్దాలు ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరానికి, 120 మంది రోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, తేజు, ప్రకాష్, దనలక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన గంగ జాతర

**ప్రజాశక్తి-కార్వేటినగరం:** మండల పరిధిలోని కెవిం పురం గ్రామం, పాదిరి కుప్పం, కార్వేటినగరం పెద్ద దళితువాడలలో గంగమ్మ జాతర వైభవంగా ముగిసింది. గ్రామస్తులు వేషకాలు వేసి గంగమ్మకు మొక్కుబడులు తీర్చుకున్నారు. వేషకాలు పలువురిని ఆకట్టుకుంది. మంగళవారం రాత్రి గంగమ్మకు ఇంటింటా భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కెవిం పురంలో అమ్మవారిని జీడీ నెల్లూరు టిడిపి ఇన్‌ఛార్జ్ భీమినేని చిట్టిబాబు నాయుడు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్తుల ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. గ్రామం విద్యుత్ కాంతులతో నిండిపోయింది. వీధుల్లో వేపాకు తోరణాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పాదిరి కుప్పంలో గంగమ్మకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి సారె సమర్పించారు.

## నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి–పులిచెర్ల: ఇంటర్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా విద్యా బోధన అందిస్తున్నామని హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం పోకల తాతయ్య తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్ ఇంటర్ అడ్మిషన్లను బుధవారం ప్రారంభించారు. పోకల తాతయ్య మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు వస్తున్నాయన్నారు. హైస్కూల్ ప్లస్ పాఠశాల ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన అందిస్తున్నామన్నారు. మెరుగైన ఫలితాలకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. ఇంటర్ ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, లలిత, వెంకటరమణ, దేవేంద్రనాథ రెడ్డి, ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, పద్మవేణి, రహమత్ భాషా పాల్గొన్నారు.

## ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు

**ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:** విద్యా హక్కు చట్టం ప్రకారం ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ప్రవేశించే విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలని ఈ మేరకు డివైఈఒలు, ఎంఈఒలు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న ప్రతి విద్యార్థి పాఠశాలల్లో చేరేలా పాఠశాల యాజమాన్యాలతో సంప్రదించి చేర్పించాలని కోరారు.

# తాళాలు వేసుకొని వెళ్లిపోవడం ఏంటి?

**ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:** మండల పరిధిలోని పాచిగుంటలో బుధవారం నిర్వహించిన గడపగడపకు కార్యక్ర మంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాచిగుంటలో 20 ఇళ్లకు తాళాలు వేసుకుని బయటకు వెళ్లిపోయారు. కేవలం రెండు ఇండ్లు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. మిగిలిన 20 ఇళ్లకు తాళాలు మాత్రమే దర్శనమిచ్చాయి. దీంతో ఉప ముఖ్యమంత్రితో పాటు అధికారులు అవాక్కయ్యారు. దళిత వాడలలో సైతం పలు ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో మిగిలిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరుపై సమాచారాన్ని సేకరించారు. అనంతరం బాలాపురం, గొల్లపల్లి, చౌటూరు, కొండ్ల సందూరు, పిచ్చిరెడ్డిపల్లిలో సైతం గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, మాజీ సర్పంచ్ చంగల్రాయి శెట్టి, రైతు నాయకులు రాజేంద్రనాయుడు, నేతలు నవీన్ నాయుడు, ప్రభాకర్, సుధాకర్, ముని రాజారెడ్డి, చంద్రారెడ్డి, లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వీఆర్వో పై ఆగ్రహం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం**

మండలంలో వీఆర్వోపై డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుక్కాపట్నం వీఆర్వో లోకనాథంను చూడగానే ఆగ్రహంతో ఊగిపోయారు. గతంలో పాచిగుంట పంచాయతీలో వీఆర్వోగా పనిచే స్తున్నప్పుడు ప్రతి ఒక్కరి దగ్గర రెవిన్యూ పరిధిలో ఉన్న ఏదో ఒక పని చేసిస్తానని ప్రతి దళితుల దగ్గర లంచాలు రూపంలో డబ్బులు తీసుకున్నావని ఫిర్యాదులు చేస్తున్నా రని, నీలాంటి వాళ్ల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుం దని, నీ పైన దర్యాప్తు చేసి లంచాలు తీసుకున్నది నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులచే విచారణకు ఆదేశించి నున్నట్లు డిప్యూటీ సీఎం ఆగ్రహంతో ఊగిపోయారు.

## బండిబాటను ఆక్రమించుకున్న నాయకులు

**ప్రజాశక్తి-విజయపురం:** స్థానిక మండల పరిధిలోని ఇళ్లత్తురు గ్రామపంచాయతీకి చెందిన కొత్త ఇళ్ళత్తురు నుంచి పాత ఇళ్ళత్తురుకు గత కొన్ని సంవత్సరాలపాటు గ్రావెల్ రోడ్డు కలదు. ఎన్నో ఏళ్లుగా రాకపోకలు సాగించిన బండి బాటను కొంత మంది నాయకులు ఆక్రమించుకున్నారు. ఈ గ్రామానికి చెందిన 108–1, 2, 5 అలాగే 115– 6, 7, 8, 9, 10, 11 సర్వే నెంబర్లు 1996లో గ్రావెల్ రోడ్డు, 2006 లో రూ.10 లక్షలతో మెటల్ రోడ్డు వేశారు. అదే కాకుండా ఆ దారిలో ఆర్టీసీ బస్సు కూడా పోతూ వస్తుండేది. గ్రామ దేవత అయిన కొల్లాపూరమ్మ, గంగమ్మ సైతం ఆ దారిలో తీసుకుపోతారు. ఈ మధ్యకాలంలో కొంతమంది వ్యక్తులు ఆ రోడ్డుపై కన్ను వేసి కబ్జాకు పాల్పడ్డారు. దీంతో గ్రామస్తులు అడగ్గా ఈ దారిని మేము కొనుగోలు చేసుకున్నామంటూ దౌర్జన్యం చేయడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఆరు నెలల ముందే ఫిర్యాదు చేయడమైంది. రెవెన్యూ అధికారుల పని తీరు ఎలా ఉందంటే దొంగలు పడ్డ ఆరు నెలల తర్వాత కుక్కలు మొరిగాయి అన్నట్టుంది. ఎందుకంటే రెండుసార్లు సర్వేయర్, వీఆర్వోలు వచ్చి తూతూ మంత్రంగా సర్వే పనులు మొదలుపెట్టారు. కానీ కొంతమంది వ్యక్తులు వచ్చి దౌర్జన్యం గా పనులకు ఆటంక పరిచారని వెంటనే వెనుతిరిగి వెళ్ళిపో యారు. దీని విషయంగా ఇళ్లత్తురు పంచాయతీ ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆ రోడ్డు పక్కనే ఇంటి స్థలాల పట్టాలిచ్చారు. ఇంటి పట్టా పూజగదిగే పరిమితమైంది. ఎందుకంటే ఆ ఇంటి స్థలాన్ని సర్వే చేసి ఇవ్వకపోవడం గమనార్హం. ఆ ఇంటి స్థలాన్ని కూడా దోచేసుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం మేలుకొని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రాజెక్టు నిర్మాణాలపై స్టే తీసుకురావడం సిగ్గుచేటు

**ప్రజాశక్తి-పలమనేరు:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు రిజర్వాయర్ల నిర్మాణం చేపడితే రెండు ప్రాజెక్టుల నిర్మాణ పనులు దాదాపుగా 90 శాతం పూర్తి చేయగా ఇప్పుడు కక్షపూరితంగా చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టుకు వెళ్లి ప్రాజెక్ట్ నిర్మాణాలపై స్టే తీసుకురావడం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే వెంకటే గౌడ చంద్రబాబుపై ధ్వజమెత్తారు. బుధవారం మున్సిపాలిటీలోని ఎద్దులసంత స్ట్రీట్ సచివాలయ పరిధిలోని వార్డు నెంబర్ 25, 26 లలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మీ గడప వద్దకే మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి 946 గహాలను సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి నాలుగేళ్లలో లబ్ధి పొందిన వివరాలు లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థికంగా లబ్ధి పొందారని గతంలో రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇంటి పట్టాలు ఇస్తే, దానిని ఒకటిన్నర సంవత్సరం పాటు కోర్టులో అడ్డుకున్న చరిత్ర చంద్రబాబుదని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. వాటిని జీర్ణించుకోలేకనే చంద్రబాబు నాయుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని పోపోయారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, మున్సిపల్ ఛైర్ పర్సన్ పవిత్ర మురళీకష్ణ, వైస్ ఛైర్మన్ చాన్మ కమల్ బాషా, జేసీఎస్ కోదండ రామయ్య, కౌన్సిలర్ మండి సుధాకర్ పాల్గొన్నారు.

## ఏనుగుల దాడులు.. భయాందోళనలో ప్రజలు

**ప్రజాశక్తి-వి.కోట:** మండల పరిధిలోని అటవీ సరిహద్దు తోట కనమ సమీపంలో మంగళవారం రాత్రి 14 ఏనుగుల గుంపు ప్రవేశించాయి. దీంతో రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తు న్నారు. కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సంతతి అంత కంతకు పెరుగుతోంది. కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా కౌండిన్య అభయారణ్యం చేరుకున్న ఏనుగులు ఇటీవల పంటపొలాలపై దాడులకు పాల్పడుతున్నాయి. తోటకనుమ సమీపంలోని సొన్నేగౌని చెరువులో ఏనుగుల గుంపు సేదతీరి పంట పొలాల మీదుగా అటవీ ప్రాంతంలోకి బయలుదేరా యి. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ప్రజల సహకారంతో బాణాసంచా కాల్చి ఏనుగులను నెమ్మదిగా అడవిలోకి మరల్చారు. మార్గమధ్యంలో మామిడి, టమోటా, బీన్స్ తదితర పంటలను తొక్కుతూ, తింటూ ఏనుగులు ధ్వం సం చేశాయని ప్రజలు వాపోయారు. అటవీ శాఖ అధికారు లు, సిబ్బంది ఏనుగులను క్రాకర్స్‌తో తోటకనుమ నుంచి ప్రధాన రహదారి దాటించి కైగల్ అటవీ ప్రాంతం వైపు మళ్ళించారు. దండికుప్పం ప్రాంతంలో ఇప్పటికే పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు తిరిగి ఎక్కడ పంటల వైపు వస్తాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## గంగమ్మ జాతర్లకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారె

**ప్రజాశక్తి-క్యాంపస్:** తిరుపతి రూరల్ మండలం చిగురువాడ, కుంట్రపాకం, తణపల్లి పంచాయతీల్లో బుధవారం జరిగిన గంగమ్మ జాతరలో చంద్రగిరి నియోజక వర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సందడి చేశారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టు వస్త్రాలు తీసుకు వెళ్లి జాతర జరిగే గ్రామాల్లో సమర్పిం చారు. అవిలాల పంచాయతీ అంబేద్కర్ కాలనీలో గంగమ్మ తల్లికి సారెను తీసుకు వెళ్లిన మోహిత్ రెడ్డిని గ్రామ పెద్దలు సాదర స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

**రేణిగుంట:** మండలంలోని అత్తూరు గ్రామ పంచాయతీలో బుధవారం గంగజాతర సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్షరెడ్డి సారె సమర్పించారు. కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, మండల అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరి మంచి కోసమే జాతర్లు

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** ఏటా పల్లె పల్లెల్లో జరిగే జాతర మహోత్సవాలు ఆయా ఊర్ల మంచి కోసమేనని.. జాతర్లు జరపడంతో ఆ ఏడాదంతా వర్షాలు పడి.. పాడి పంటలు పుష్కలంగా వస్తాయని.. అది ఆయా గ్రామాల అభివృద్ధికి సహకరిస్తుందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని పాతపల్లూరు, కొత్త తిమ్మాపురం, పాత తిమ్మాపురం, పిళ్లారిపట్టు, పుత్తూరు రూరల్ మండలంలోని తొరూరు, నేసనూరు, గట్టు, వడమాలపేట మండలం వడమాలపేట గ్రామ జాతర్లలో పాల్గొని ఆయా గ్రామాల్లో కొలువైన గంగమ్మలను దర్శించుకున్నారు. రూరల్ అధ్యక్షులు రవికుమార్, బాలిరెడ్డి, వడమాలపేట నాయకులు జాన వెంకటయ్య, ధనంజయనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

నేసనూరు, గట్టు, పిళ్లారిపట్టు, తిరుమలరాజుల కండ్రిగ గ్రామాల్లో జాతరకు హాజరై అమ్మవారి దీవెనలు అందుకున్నారు. బుధవారం మంత్రి ఆర్కే రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి పాల్గొని పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందస్వామిరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ రామ్‌బత్తయ్య, గట్టు ఇంజినీర్ మురళి, చిట్టి, జలకం సునీల్, వెంకటముని, మేస్త్రి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేయాలి

**ప్రజాశక్తి-పాలసముద్రం:** మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలు, జగనన్న కాలనీలోని గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో శ్రీనివాసన్ తెలిపారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గృహ నిర్మాణ పనులు నత్త నడకగా సాగుతుందని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు, ఉచితంగా ఇసుక, తక్కువ ధరకు సిమెంటు ఇస్తున్నా పనులు మాత్రం అంతంత మాత్రం జరుగుతున్నాయని తెలిపారు. సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లో చొరవ తీసుకొని గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహానాడును జయప్రదం చేద్దాం

**ప్రజాశక్తి-పలమనేరు:** ఈ నెల 27, 28 తేదీలలో రాజమహేంద్రవరంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పలమనేరు పట్టణ అధ్యక్షులు ఆర్‌బిసి కుట్టి కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమై మహానాడు కార్యక్రమ కార్యాచరణపై చర్చించారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈ దఫా జరుగుతున్న మహానాడు కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతతో సంతరించుకుందని అతిరథమహారథులు విచ్చేయనున్న ఈ కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, టిడిపి సానుభూతిపరులు హాజరు కావాలని కోరారు. పలమనేరు నుంచి అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో మహానాడు కార్యక్రమానికి తరలివెళ్ళనున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. నాయకులు గిరిబాబు, ఖాజా పీర్, నాగరాజు, మదన్, చిన్ని, షరీఫ్, వీరప్ప, సుధాకర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, వెంకటరమణ పాల్గొన్నారు.

## డ్రోన్ సర్వే ప్రారంభం

**ప్రజాశక్తి-నగరి:** మున్సిపల్ పరిధిలో మా భూమి–మా హక్కు పథకంలో చేపట్టనున్న డ్రోన్ సర్వేను బుధవారం మంత్రి ఆర్కేరోజా తన క్యాంప్ కార్యాలయం వద్ద ప్రారంభించారు. కచ్చితమైన ఆస్తుల వివరాలను ప్రతి ఒక్కరికీ పత్రాల రూపంలో అందించడానికి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలో త్వరితగతిన పూర్తిచేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. సర్వేచేసి పట్టాను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, డీఈ నరేష్, టౌన్‌ప్లానింగ్ అధికారి నీరజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరూ ఆలయాలను సందర్శించాలి

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** ప్రతి ఒక్కరూ ఆలయాలను సందర్శించాలని కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర స్వామి అన్నారు. బుధవారం మండలంలోని నల్లగాంపల్లెలో వెలిసియున్న శ్రీ విరూపాక్షమ్మ దేవస్థానానికి శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర స్వామి సరస్వతి దర్శించుకున్నారు. అనంతరం జరిగిన ప్లేయగల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయాలను సందర్శించాలని ఆలయాల సందర్శించడం వలన మనశ్శాంతి ఏకాగ్రత లభిస్తుందని అన్నారు. అనంతరం పలువురికి శాంతి సందేశంలో విన్నవించారు. సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, మాజీ ఎంపీపీ సుచిత్ర, మాజీ ఎఎంసి ఛైర్మన్ జయచంద్ర నాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిచ్చిలి భాస్కర్ రెడ్డికి మంత్రి నివాళి

**ప్రజాశక్తి-రొంపిచెర్ల:** మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి చిన్నాన్న భాస్కర్ రెడ్డికి బుధవారం జరిగిన పెద్దకర్మలో రాష్ట్ర విద్యుత్తు, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. మతుడు భాస్కర్ రెడ్డి చిత్రపటానికి మంత్రి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి భాస్కర్ రెడ్డి కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అటు పార్టీకి, ఇటు కుటుంబానికి ఆయన లేనిలోటు తీరనిదని మంత్రి విచారం వ్యక్తం చేశారు. మాజీ శాసనసభ్యులు జివి శ్రీనాథ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. మంత్రి వెంట జడ్పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి, ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు చిత్తూరు రూరల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. రూరల్ సీఐ కథనం మేరకు వివరాలు.. బుధవారం చిత్తూరు రూరల్ సీఐ ఆధ్వర్యంలో తవణంపల్లి మండలంలో తనిఖీలు చేపట్టారు. మత్యం క్రాస్ రోడ్ వద్ద ఎగువ మత్యంకు చెందిన సెల్వరాజ్ కుమారుడు అరుల్ అక్రమంగా కర్ణాటక మద్యం కలిగి ఉండటంతో అక్రమ మద్యం రవాణా కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై మోహన, హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణయ్య, సుబ్రమణ్, సిబ్బంది కిరణ్ కుమార్, క్రిష్ణవేణి, మమత పాల్గొన్నారు.

## చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి-బంగారుపాళ్యం:** చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్ చేసినట్టు సిఐ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో బంగారుపాళ్యం మండల కేంద్రంలో గత నెలలో జరిగిన ఎంఐ షోరూం సెల్ఫోన్ల దొంగతనంలో శాంతిపురం మండలం చెందిన వెంకటేశుల కుమారుడు సతీష్ ను బుధవారం మొగిలి వద్ద అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. అతని విచారించగా గత నెల మండల కేంద్రంలోని ఎంఐ షో రూమ్‌లో సెల్ఫోన్లో అపహరించినట్లు నేరం అంగీకరించాడు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు సిఐ నరసింహారెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తం, కానిస్టేబుల్ నీరజాక్షలు, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

## యువజన అధ్యక్షులుగా కావలి సతీష్

**ప్రజాశక్తి-వెదురుకుప్పం:** మండల జనసేన పార్టీ యువజన అధ్యక్షులుగా కావలి సతీష్‌ను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొన్న యుగంధర్ తెలిపారు. బుధవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మీడియాతో మాట్లాడుతూ విలువ ఆధారిత రాజకీయ సంస్థ. ఇది మన ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడా నికి నిరంతరం కషి చేస్తున్న కావలి సతీష్ శ్రమను గుర్తించి పార్టీ అధిష్టానం అతనికి వెదురుకుప్పం మండలం యువజన అధ్యక్షులుగా నియమించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉన్నారు.

## హోరాహోరీగా చంద్రగిరి ఐపీఎల్ టోర్నీ

**ప్రజాశక్తి-క్యాంపస్:** చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తలపెట్టిన చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో యువత పరుగులతో చెలరేగారు. బుధవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు పరుగుల వర్షం కురిపించగా పలువురు బంతులతో మాయాజాలం సష్టిస్తూ వరుస వికెట్లు తీసుకున్నారు. బరిలో దిగిన ప్రతి ఒక్కరూ విజయం కోసం శ్రమించగా మరికొందరు ఓటమితో నిరాశ చెందారు. 13 గ్రౌండ్లలో 52 మ్యాచ్‌లు నిర్వహించారు. విజేతలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునికష్ణ, చిగురువాడ సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, అవిలాల పార్టీ అధ్యక్షుడు లోకనాథ రెడ్డి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

## తిరుమలలో హాకర్ల మధ్య వివాదం

### కత్తితో దాడి, కేసు నమోదు

**ప్రజాశక్తి తిరుమల :** తిరుమల సి.ఆర్.ఓ కార్యాలయం వద్ద ఓ దుకాణం వద్ద ఇద్దరి హకర్ల వివాదం చెలరేగింది. బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఒకరిపై ఒకరు దాడికి దిగి కత్తితో పొడుచుకున్నారు. సమీపంలో ఉన్న భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసునమోదుచేసి గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు..ఈ మధ్యకాలంలో అనధికార హకర్ల అధికమవ్వడంతో తరచు వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. టిటిడి, పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.